## సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**97053 47483**

నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### సాయిబాబా ఆలయంలో కలశ పూజలు



స్వామికి అభిషేకం చేయడానికి కలశాలతో వస్తున్న మహిళలు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్‌లో షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం కలశ పూజలు ఘనంగా జరిగాయి. సోమవారం ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ఉగాదితో ముగియనున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం 108 కలశాలతో మహిళలు స్వామికి అభిషేకం చేశారు. బుధవారం సామూహిక సత్యవ్రతాలు ఆచరించనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దిలపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్–1లో మద్దిలపాలెం సెక్షన్ పరిధిలో పలు మరమ్మతు పనులు జరగనుండడంతో గురువారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ కేఆర్ఎం కాలనీ, శివాలయం, చైతన్యనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

### యూజీడీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మి

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో 157 సచివాలయం పరిధిలో యూజీడీ పనుల ప్రగతిని కార్పొరేటర్ మువ్వల లక్ష్మి మంగళవారం పరిశీలించారు. రామరాజు పార్క్ వెనక భాగంలో దీర్ఘకాలంగా యూజీడీ సమస్య ఉంది. స్థానికులు ఈ సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ఈ మేరకు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కోరారు.

### మసీదుకు నీటి సదుపాయం



కుళాయిలు ప్రారంభిస్తున్న గోవింద్, ముస్లింలు

బీచ్ రోడ్డు: రంజాన్ మాసాన్ని దృష్టిలో పెట్టుకుని జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీ తారా మసీదు వద్ద నీటి సదుపాయం కల్పించారు. మసీదు వద్ద నీటి సమస్యను ముస్లిం పెద్దలు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల దృష్టికి తీసుకెళ్లగా.. జీవీఎంసీ అధికారులతో మాట్లాడి మంగళవారం మసీదుకు నీటి సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా గోవింద్‌కు ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు.

### ఇంటర్ పరీక్షలకు ఏడుగురు గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలల్లో మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్, సివిక్స్, బోటనీ పరీక్షలకు ఏడుగురు గైర్హాజరయ్యారు. జూనియర్ కళాశాలలోని సెంటర్–ఏలో జరిగిన పరీక్షకు 530 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. నలుగురు గైర్హాజరయ్యారు. కృష్ణా డిగ్రీ కళాశాలలోని సెంటర్–బీలో జరిగిన పరీక్షకు 528 మంది హాజరు కావాల్సి ఉండగా.. ముగ్గురు గైర్హాజరయ్యారు.



# గ్రీన్ బెల్ట్‌లు.. ఆహ్లాదకరం



పిఠాపురం కాలనీలో గ్రీన్ బెల్ట్‌లో ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్



పిఠాపురంకాలనీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్



గ్రీన్ బెల్ట్ వద్ద గ్రావెల్‌తో సుందరీకరణ పనులు

- పార్కుల నిర్మాణంతో సేద తీరుతున్న నగరవాసులు
- ఓపెన్ జిమ్‌తో పాటు వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు

మద్దిలపాలెం: జాతీయ రహదారికి ఆనుకుని చెత్త, తుప్పలతో అధ్వానంగా దర్శనమిచ్చే గ్రీన్ బెల్ట్‌లు ప్రస్తుతం ఆహ్లాదకరమైన పార్కులతో ఆకట్టుకుంటున్నాయి. పర్యావరణ పరిరక్షణకు హైవేకు మణిహారంలా ఉన్న గ్రీన్ బెల్ట్‌లకు మహర్దశ పట్టింది. ఈ నెలలో నగరంలో జరగనున్న జీ–20 సదస్సు దృష్ట్యా సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎయిర్ పోర్టు నుంచి హనుమంతవాక వరకు ఉన్న హైవేకు ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్, డివైడర్ ఆధునికీకరణ పనులు ఊపందుకున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రీన్ బెల్ట్‌కు రక్షణగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ చాలా చోట్ల ధ్వంసమైంది. దీంతో ఇవి ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారాయి. జీ–20 సదస్సు పుణ్యమా అని సుందరీకరణలో భాగంగా గ్రీన్‌బెల్ట్‌లకు కొత్త శోభ సంతరించుకుంది. తూర్పు నియోజకవర్గం పరిధిలో సత్యం సెంటర్ నుంచి హనుమంతవాక వరకు హైవేకు ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ ఆధునికీకరణ చేపడుతున్నారు. గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తా చెదారం జేసీబీలతో తొలగించారు. అనంతరం సుమారు అడుగు మేర గ్రావెల్‌తో చదును చేశారు. కంచె పాడైన చోట కొత్తగా ఇనుప స్తంభాలు వేసి తీగలు చుడుతున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పై ఉన్న గ్రిల్స్‌కు, గోడలకు పెయింటింగ్ వేసి ముస్తాబు చేస్తున్నారు.

మద్దిలపాలెం కూడలి నుంచి సత్యం జంక్షన్ వరకు గల గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో పచ్చని చెట్ల మధ్య వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. గ్రీన్ బెల్ట్‌ను చదును చేసి రెండు మీటర్ల వెడల్పు, 509 మీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్ నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పక్కనే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తుండడంతో వ్యాయామానికి అనువుగా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆధ్యాత్మికం

### వైభవంగా నూకాలమ్మ పండగ



రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ



పాత ఆరిలోవలో నూకాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: నూకాలమ్మ పండగ మంగళవారం ఆరిలోవ ప్రాంతంలో ఘనంగా జరిగింది. బాలాజీనగర్ దరి పాత ఆరిలోవ, రూరల్ తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పాత ఆరిలోవ అమ్మవారి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. బాలాజీనగర్, పాత ఆరిలోవ, తోటగరువు, గాంధీనగర్, డ్రైవర్స్‌కాలనీ, అంబేడ్కర్ నగర్, టీఐసీ పాయింట్, లీలాసుందరినగర్, నెహ్రూనగర్, దుర్గాబజార్ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. లీలాసుందరినగర్ నుంచి గ్రామస్తులు డప్పులు, వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రూరల్ తహసీల్దారు కార్యాలయం ఎదురుగా నూకాలమ్మ అమ్మవారిని విశాలాక్షినగర్, ఇందిరానగర్, రెవెన్యూ కాలనీ, డెయిరీఫారం నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

### సింహాద్రిపురంలో కోలాహలం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, కార్పొరేటర్ శ్రీవిద్య, అప్పారావు.

మద్దిలపాలెం: కొత్త అమావాస్య సందర్భంగా జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురంలో నూకాలమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, అప్పారి గిరిబాబు.. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీలా వెంకట్, నరాల సత్తిబాబు, బుగత ఏసురత్నం, గొలగాని త్రినాథ్ పాల్గొన్నారు.

నగరం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కోలాటం, తప్పెటగుళ్లు, బళ్ల, నేల వేషాలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం అమ్మవారి శతకం పట్టు నుంచి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

జాతరలో భక్తులకు సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు పడాల గోవింద్ శీతల పానియాలు పంపిణీ చేశారు.

### కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో కొలువుదీరిన కాలభైరవ స్వామికి కొత్త అమావాస్య సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాశ్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మ భక్తుల పేరిట పూజలు జరిపారు. స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

## ఏయూ సమాచారమ్

### 'ఆనందదాయకంగా అభ్యసనం'



విద్యార్థిని శాస్త్రీయ నృత్య ప్రదర్శన

ఏయూ క్యాంపస్: అభ్యసన విధానం ఆనందదాయకంగా సాగాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం వర్సిటీ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ వార్షికోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ నేటితరానికి అవసరమైన భవిష్యత్ నైపుణ్యాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో డిజిటల్ యూనివర్సిటీలు రానున్నాయని చెప్పారు. ఆచార్యులు నిరంతరం అభ్యాసకులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ జాతీయ విశ్వవిద్యాలయాలకు దీటుగా ఏయూ అభివృద్ధి సాధిస్తోందన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత, విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, ఆచార్యులు కె.రమాసుధ, శ్రీను నాయక్ పాల్గొన్నారు. అనంతరం విద్యా, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు.

### ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం



మొక్కలు నాటుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ శానిటేషన్, బ్యూటిఫికేషన్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి వర్సిటీ పరిపాలన భవనం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, శానిటేషన్, బ్యూటిఫికేషన్ విభాగం డీన్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, శ్రీధర్‌బాబు, సీఎస్‌వో మహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

# బీఆర్‌టీఎస్‌లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



పాత పందుల ఫారం కూడలి వద్ద వేసిన స్పీడ్ బ్రేకర్

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌లో ఎట్టకేలకు వాహనాల వేగానికి కళ్లెం పడుతోంది. నిత్యం మితిమీరిన వేగంతో వెళ్తున్న వాహనాలకు బ్రేక్‌లు వేయడానికి జీవీఎంసీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో జరగనున్న జీ–20 సదస్సులో భాగంగా జీవీఎంసీ అధికారులు బీఆర్‌టీఎస్‌ను ముస్తాబు చేస్తున్నారు. దీంతో పాటు వాహనాలు వేగాన్ని తగ్గించడానికి కూడళ్లలో స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారు. పాత పందుల ఫారం, పెదగదిలి, చినగదిలి కూడళ్లలో వీటిని నిర్మించారు. బీఆర్‌టీఎస్ మార్గంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

# సమస్యలపై ఆశా కార్యకర్తల ధర్నా



ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

మహారాణిపేట: ఆశా కార్యకర్తలను పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. 62 సంవత్సరాలు రిటైర్‌మెంట్ జీవోను వర్తింపజేయాలని, కోవిడ్‌కు మరణించిన ఆశా వర్కర్లకు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు.

# రాగి జావలో పోషకాలు పుష్కలం



కేడీపీఎం పాఠశాలలో రాగిజావ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి



10వ వార్డు ఎస్ఐజీ నగర్ పాఠశాలలో పిల్లలకు రాగి జావ అందిస్తున్న విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ



13వ వార్డు పాఠశాలలో రాగి జావ అందిస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత



ఇసుకతోట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు

ఆరిలోవ: జగనన్న గోరుముద్దలో భాగంగా మంగళవారం రాగి జావ పంపిణీ కార్యక్రమం తూర్పు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైంది. ఇప్పటి నుంచి పాఠశాలల్లో మంగళ, గురు, శనివారాల్లో విద్యార్థులకు రాగి జావ అదనంగా అందించనున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాగి జావలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయని కొనియాడారు.

- జీవీఎంసీ 13వ వార్డు ఆపరేషన్ కాలనీ, భగత్‌సింగ్‌నగర్, దీన్‌దయాళ్‌పురం, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో కార్పొరేటర్ కెల్ల సునీత, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో కలసి విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు.
- 10వ వార్డు ఎస్ఐజీ నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి ఉపాధ్యాయులతో కలసి రాగి జావ అందజేశారు. తోటగరువు ప్రాథమిక పాఠశాలలో శ్రీసత్య సేవా సమితి సభ్యులు రాగి జావ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.ఆర్.ఎన్.నాయుడు, హెచ్‌ఎం విశ్వనాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెదగదిలి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రవికిరణ్, సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్.శ్రీనివాసరావు విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు.

ఏయూ క్యాంపస్: కేడీపీఎం పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి రాగిజావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుమతిబాయి, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు ఇసుకతోట, వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల్లో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు రాగిజావ వడ్డించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పారి గిరిబాబు, పీలా వెంకట్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలోని సీఎంఆర్ ప్రాథమిక పాఠశాలలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు విద్యార్థులకు రాగిజావ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు సిహెచ్.నాగేశ్వరరావు, ఒమ్మి పోలరత్నం, మీసాల ప్రదీప్ పాల్గొన్నారు.

## 25న గర్భిణులకు ప్రత్యేక వర్క్‌షాప్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 25న ఆర్యజనని సంస్థ సహకారంతో గర్భిణులకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు కేంద్రం విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మికత, ఆధునిక జ్ఞానాన్ని మేళవిస్తూ ఈ వర్క్‌షాప్ జరగనుందని పేర్కొన్నారు.

యోగా, ధ్యానం, బేబీ బాండింగ్, ఆత్మీయ గానం, ప్రెగ్నెన్సీ లైఫ్‌స్టైల్ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాల కోసం 91008 55823 నంబరులో సంప్రదించాలని కోరారు.



# చికిత్స పొందుతూ ఇద్దరు మృతి



ప్రమాద స్థలిలో గాయాలతో శ్రీనివాసరావు

తగరపువలస: స్థానిక గోస్తనీ నది వంతెనపై సోమవారం మధ్యాహ్నం ప్రమాదానికి గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఎర్నింటి శ్రీనివాసరావు(38), బుగత సూరిబాబు(46) మంగళవారం వేకువజామున మృతి చెందారు. భీమిలి ఎస్ఐ గంటా హరీష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆరిలోవ బాలాజీనగర్ వివేకానంద కాలనీ, వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంతానికి చెందిన ఎర్నింటి శ్రీనివాసరావు, బుగత సూరిబాబు ఈ నెల 20న ఉదయం ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం 3.45 గంటల సమయంలో తగరపువలస సమీపంలోని వెంకటేశ్వర మెట్ట కూడలికి చేరుకున్నారు. అకస్మాత్తుగా అక్కడ యూ టర్న్ తీసుకుని రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా విజయనగరం వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. వారికి సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వీఎంసీ విద్యార్థినులకు ప్రతిభా స్కాలర్‌షిప్



విద్యార్థినులకు ఎంపిక పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు

ఎంవీపీ కాలనీ: కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయం(ఢిల్లీ) అందించే ప్రతిభ స్కాలర్‌షిప్‌నకు ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న టి.తేజస్వినీ, ఎస్.లావణ్య జాతీయ సంస్కృత మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. వివిధ పరీక్షల్లో సంస్కృతంలో సాధించిన అత్యధిక మార్కులకు గాను మంజూరైన ఈ స్కాలర్‌షిప్ కింద మూడేళ్ల పాటు సంస్కృత విశ్వవిద్యాలయం నగదు అందజేస్తుందన్నారు.

## ప్రాణికోటికి జలమే జీవాధారం



అంతర్జాతీయ నీటి దినోత్సవ పోస్టర్ ప్రదర్శిస్తున్న హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థినులు

మద్దిలపాలెం: ప్రాణకోటికి జీవాధారం జలమేనని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపకుడు జె.వి.రత్నం అన్నారు. 1993 మార్చి 22వ తేదీని ప్రపంచ నీటి దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ మేరకు గ్రీన్ క్లైమేట్ ఆధ్వర్యంలో పిఠాపురం కాలనీలోని సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ అడవులు, జల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. అనంతరం నీటి దినోత్సవం పోస్టర్‌ను విద్యార్థులు ఆవిష్కరించారు.

## వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి కుటుంబ సభ్యురాలికి రూ.10 వేలు చెక్కు అందిస్తున్న సచివాలయం సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్‌లో గుజరాతి రమేష్ అనే వ్యక్తి క్యాన్సర్ వ్యాధితో మంగళవారం మృతి చెందారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష బాధిత కుటుంబానికి మంజూరైంది. ఈ మేరకు సచివాలయం అడ్మిన్ జ్యోత్స్న, వెల్ఫేర్ సెక్రటరీ వాసంతి.. మృతుడి ఇంటికి వెళ్లి తక్షణ సహాయంగా రూ.10 వేలు నగదు అందజేశారు. మిగతా నగదు కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని వారు తెలిపారు.